ఆర్బీఐ కార్యాలయాల్లో బారులు

రూ.2వేల నోట్లను మార్చుకునేందుకు ప్రజల పరుగులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: బ్యాంకుల్లో రూ.2వేల నోట్లను తీసుకోవడం ఆపేయడంతో ఇప్పుడు వాటిని మార్చుకునేందుకు అంతా ఆర్బీఐ కార్యాలయాల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఈ క్రమంలోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫీసుల వద్ద పెద్ద ఎత్తున క్యూలైన్లు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది మే 19న రూ. 2,000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు ఆర్బీఐ ఆశ్చర్యకర ప్రకటన చేసిన విషయం తెలిసిందే. అయితే సెప్టెంబర్ 30 వరకు బ్యాంకుల్లో సదరు నోట్లను మార్చుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఆ తర్వాత ఈ గడువును ఈ నెల 7 వరకు పొడిగించిన ఆర్బీఐ.. 8 నుంచి దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ కార్యాలయాల్లో మాత్రమే మార్చుకునే వీలు కల్పించింది. దీంతో ఆయా కార్యాలయాల్లో తమ దగ్గరున్న రూ.2,000 నోట్లను మార్చిడి చేసుకునేందుకు జనాలు, వివిధ సంస్థల ప్రతినిధులు క్యూ కడుతున్నారు. ఒకసారి పది నోట్లు (రూ. 20,000) మాత్రమే మార్చుకునేందుకు వీలున్నది. ఇదిలావుంటే చలామణిలో ఉన్న రూ.2వేల నోట్లలో రూ.3.43 లక్షల కోట్లు తిరిగి వచ్చేశాయని, ఇంకా దాదాపు రూ.12,000 కోట్లు మాత్రమే రావాల్సి ఉందని ద్రవ్యసమీక్ష సందర్భంగా గత శుక్రవారం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించినది విదితమే. 2016 నవంబర్‌లో రూ.500, రూ.1,000 నోట్ల రద్దు నేపథ్యంలో ఆర్బీఐ ఈ రూ.2,000 నోట్లను పరిచయం చేసింది. తద్వారా చలామణిలో మళ్లీ పెద్ద ఎత్తున నగదు నిల్వలను వేగంగా పెంచగలిగింది.

భగ్గుమన్న బంగారం

ప్రపంచ మార్కెట్లో గంటలో 60 డాలర్లు జంప్

ఎంసీఎక్స్‌లో తులం ధర రూ.1,500 పెరుగుదల

తీవ్రతరమైన ఇజ్రాయిల్-పాలస్తీనా వార్

సురక్షిత పెట్టుబడులకు ఇన్వెస్టర్ల పరుగు



హైదరాబాద్, అక్టోబర్ 13: పండుగ సీజన్లో తక్కువ ధరలో పుత్తడి కొనుగోలుకు వేచిచూస్తున్నవారికి షాక్‌నిస్తూ శుక్రవారం రాత్రి ఒక్కసారిగా బంగారం ధర భగ్గుమంది. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిల్-గాజాల మధ్య యుద్ధం తీవ్రతరంకావడంతో ప్రపంచ మార్కెట్లో ఔన్సు బంగారం ఫ్యూచర్ ధర ఒక గంట సమయంలోనే 55 డాలర్లు పెరిగి 1,942 డాలర్లకు చేరింది. స్పాట్ ధర అంతే మొత్తం పెరుగుదలతో 1,929 డాలర్లకు పెరిగింది. ఈ ట్రెండ్‌ను ప్రతిబింబిస్తూ భారత్‌లోని మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల పుత్తడి ఫ్యూచర్ ధర భారీగా రూ.1,500 పెరిగిపోయి రూ.59,400 స్థాయికి చేరింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభ సమయమైన మార్చి 17 తర్వాత ఒకే రోజున బంగారం ధర ఇంతిలా పెరగడం ఇదే ప్రథమం. వాస్తవానికి శుక్రవారం భారత్‌లోని వివిధ నగరాల స్పాట్ బులియన్ మార్కెట్ల ట్రేడింగ్ నిలిచిపోయిన తర్వాత ప్రపంచ మార్కెట్లో ఈ పరిణామం చోటుచేసుకున్నది. ఇదే ట్రెండ్ అమెరికా మార్కెట్లు ముగిసేంతవరకూ కొనసాగితే శనివారం హైదరాబాద్ స్పాట్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం తులం ధర రూ.60,000 స్థాయిని మించుతుంది. ఇది శుక్రవారం సాయంత్రం రూ.58,910 వద్ద ముగిసింది. తాగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపించడంతో పాటు 24 గంటల్లోగా ఉత్తర గాజాను వదిలివెళ్లాలంటూ పౌరుల్ని హెచ్చరించడంతో యుద్ధం తీవ్రతరమవున్నదన్న భయాలు మార్కెట్లో ఏర్పడ్డాయి. విపత్కర పరిస్థితుల్లో సురక్షిత పెట్టుబడి సాధనంగా పరిగణించే బంగారం కొనుగోలుకు ఇన్వెస్టర్లు పరుగులు తీశారని బులియన్ ట్రేడర్లు తెలిపారు.

వారంలో రూ.3 వేలు

గత శుక్రవారం అక్టోబర్ 6న హైదరాబాద్‌లో రూ.57,230 పలికిన 24 క్యారెట్ల తులం పసిడి తాజా పరిమాణంతో రూ.60,300 వరకూ పెరిగే అవకాశం ఉన్నందున, ఒకే వారంలో ధర రూ.3,000 మేర పుంజుకున్నట్లవుతుంది. ప్రపంచ మార్కెట్లో స్పాట్ మార్కెట్లో బంగారం ధర ఈ వారంలో 1,810 డాలర్ల నుంచి 1,926 డాలర్లకు చేరుకున్నది. ఈ ఏడాది మార్చి తర్వాత ఒకే వారంలో పుత్తడి 5 శాతం మేర పెరగడం ఇదే తొలిసారి. అక్టోబర్ 7 ఇజ్రాయిల్‌పై గాజా దాడులు జరిపిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి క్రమేపీ పెరుగుతూ వస్తున్న పుత్తడి తాజాగా మధ్యప్రాచ్యంలో మరింత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడినందున ఒక్కసారిగా భగ్గుమన్నది.

యమహా దసరా ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 13: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ యమహా మోటర్స్.. దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేసిన మాడళ్లపై ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్టు ప్రకటించింది. 150 సీసీ ఎఫ్‌జెడ్ మాడల్‌తో పాటు ఫ్యాసినో 125 ఎఫ్ఐ హైబ్రిడ్ స్కూటర్‌పై రూ.3 వేల వరకు ఇన్‌స్టాంట్ క్యాష్‌బ్యాక్‌తోపాటు రూ. 2,999 డౌన్‌పేమెంట్‌తో బైకును కొనుగోలు చేసుకునే అవకాశం కూడా సంస్థ కల్పించింది. ఈ ప్రత్యేక ఆఫర్లు ఈ నెల 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని ఒక ప్రకటనలో తెలిపింది.

రూపాయికే అభిబస్ టికెట్టు

హైదరాబాద్, అక్టోబర్ 13: దేశంలో అతిపెద్ద బస్ బుకింగ్ యాప్ అభిబస్..ప్రస్తుత పండుగ సీజన్‌లో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 19 నుంచి 25 లోపు ప్రయాణించేవారికి రూపాయికే బసు టికెట్టును బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇందు కోసం కూపన్ కోడ్ 'LUCKY1'ని వినియోగించుకొని బసు టికెటు బుకింగ్ చేసుకున్నవారికి వర్తించనున్నదని తెలిపింది.

బిగ్ 'సి' దసరా ధమాకా

హైదరాబాద్, అక్టోబర్ 13: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థల్లో అగ్రగామి సంస్థ బిగ్ 'సి'..దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటించింది. ఈ ధమాకా ఆఫర్లలో భాగంగా ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.10 వేల వరకు క్యాష్‌బ్యాక్‌తోపాటు రూ.4 వేల వరకు విలువైన ఖచ్చితమైన బహుమతిని అందిస్తున్నట్టు కంపెనీ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి తెలిపారు. అలాగే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్ కొనుగోలుపై స్మార్ట్ వాచ్‌తోపాటు 5 శాతం ఇన్‌స్టాంట్ డిస్కౌంట్, లాయల్టీ పాయింట్ ఆఫర్, 1+1 ఎక్స్టెంటెడ్ వ్యారెంటీ, స్మార్ట్ టీవీ ఆఫర్లు అందిస్తున్నట్టు తెలిపారు.

- బజాజ్ ఫైనాన్స్‌పై మొబైల్స్ కొనుగోలుపై రూ.9 వేల వరకు ఇన్‌స్టాంట్ క్యాష్ బ్యాక్
- మొబైల్/స్మార్ట్ టీవీ/ ల్యాప్‌టాప్ కొనుగోలుపై ఎస్బీఐ ద్వారా రూ.3 వేల వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌంట్, ఐసీఐసీఐ బ్యాంక్ 5 శాతం వరకు క్యాష్ బ్యాక్
- ఎంపిక చేసిన మొబైళ్లను కొనుగోలు చేసిన వారికి రూ.5 వేల విలువైన ఫైర్ బోల్ట్ స్మార్ట్ వాచ్‌ను కేవలం రూ.299కే
- ప్రతి స్మార్ట్ టీవీ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతితోపాటు రూ.14,999 విలువ గల 100 వాట్ల బోట్ స్పీకర్ కేవలం రూ.5,699కే అందిస్తున్నది.
- ఐఫోన్లు కొనుగోలు చేసిన వారికి రూ.4 వేల వరకు క్యాష్ బ్యాక్
- బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం వరకు రాయితీ
- ఆన్‌లైన్ కన్నా తక్కువ ధరకే ఎక్కువ ఆఫర్లు అందిస్తున్నది.
- ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ లేదా డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్ స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలు కొనుగోలు చేయవచ్చును.

ముంచుకొస్తున్న ముప్పు

దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచే ఫారెక్స్ నిల్వలు క్రమేణా కరిగిపోతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారం గత నెల 1 నుంచి ఈ నెల 6 వరకు ఏకంగా 14 బిలియన్ డాలర్లకుపైగా హరించుకుపోయాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే భారతీయ ఎకానమీకి పెద్ద ప్రమాదమే వాటిల్లుతుందన్న అభిప్రాయాలు ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



దేశంలో మరింత క్షీణించిన విదేశీ మారకం నిల్వలు

నెల రోజుల్లో 14 బిలియన్ డాలర్లపైనే పతనం

584.74 బిలియన్ డాలర్లకు పరిమితం

ఇలాగే కొనసాగితే సంక్షోభంలోకి భారత ఆర్థిక వ్యవస్థ

ముంబై, అక్టోబర్ 13: దేశంలోని విదేశీ మారకం నిల్వలు (ఫారెక్స్ రిజర్వులు) అంతకంతకూ పడిపోతున్నాయి. కేవలం నెల రోజుల్లో 14 బిలియన్ డాలర్లకుపైగా హరించుకుపోవడం ఇప్పుడు అత్యంత ఆందోళనకరంగా తయారైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వివరాల ప్రకారం సెప్టెంబర్ 1న 598.897 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతీయ ఫారెక్స్ నిల్వలు.. ఈ నెల 6 నాటికి 584.742 బిలియన్ డాలర్లకు దిగజారాయి. దీంతో 14.155 బిలియన్ డాలర్లు క్షీణించినట్టైంది. ఈ నెల 6తో ముగిసిన వారంలో 2.166 బిలియన్ డాలర్లు పతనమైనట్టు శుక్రవారం ఆర్బీఐ తాజా గణాంకాల్లో తేలింది. ఇక గత నెలలో ఒక్క తొలి వారంలోనే అత్యధికంగా సుమారు 5 బిలియన్ డాలర్ల మేర ఫారెక్స్ రిజర్వులు పడిపోవడం గమనార్హం. కాగా, 2021 అక్టోబర్‌లో దేశ ఫారెక్స్ నిల్వలు 645 బిలియన్ డాలర్ల గరిష్ఠ స్థాయిని తాకాయి. దాంతో పోల్చితే ఈ రెండేండ్లలో 60 బిలియన్ డాలర్ల క్షీణతే కనిపిస్తున్నది.

ఇలాగైతే కష్టమే

దేశీయ ఫారెక్స్ రిజర్వులు ఇలాగే పడిపోతే భారత ఆర్థిక వ్యవస్థకు ముప్పేనన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ఆర్బీఐ సమాచారం మేరకు వారం వారం డాలర్ నిల్వలు క్షీణిస్తున్న పరిస్థితే కనిపిస్తున్నది. దీంతో ఈ నిల్వలు బలంగా ఉంటే ఎకానమీకి ఎంత లాభమో.. బలహీనపడితే కూడా అంతే నష్టమని మెజారిటీ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ దారుణంగా పడిపోతున్నదని, ఇటువంటి సమయంలో దేశంలో డాలర్ నిల్వలు క్షీణించడం ఎంతమాత్రం మంచిది కాదని చెప్తున్నారు. ముడి చమురు దిగుమతులు భారమవుతాయని, ఫలితంగా ద్రవ్యోల్బణం పెచ్చుమీరి, ఆర్బీఐ వడ్డీరేట్లు పెరిగి, రుణ లభ్యత తగ్గుతుందని పేర్కొంటున్నారు. ఇవన్నీ కూడా దేశ జీడీపీ వృద్ధికి సవాల్ విసిరేవేనంటున్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై ఆర్బీఐ తోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా దృష్టి సారించాలని లేకపోతే మాంద్యం బారినపడటం ఖాయమని హితవు పలుకుతున్నారు. అసలే అంతర్జాతీయంగా రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు చాలవన్నట్టు.. ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధం వచ్చిపడిందని, ఇది ముదిరితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గడ్డుకాలమేనని వ్యాఖ్యానిస్తున్నారు. కరోనా నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఎకానమీకి కోలుకోలేని దెబ్బ తగులుతుందని ఒకింత భయాందోళనల్నే వెలిబుచ్చుతున్నారు.

- భారత ఫారెక్స్ రిజర్వుల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు గత నెల 29 నుంచి ఈ నెల 6 మధ్య మరో 707 మిలియన్ డాలర్లు దిగి 519.529 బిలియన్ డాలర్లకు తగ్గాయి.
- బంగారం నిల్వలు సైతం ఈ వారం రోజుల్లో 1.425 బిలియన్ డాలర్ల మేర తగ్గి మొత్తం ఫారెక్స్ రిజర్వుల్లో 42.306 బిలియన్ డాలర్లకు దిగాయి.

ఎగుమతుల్లో నిస్తేజం

సెప్టెంబర్‌లో 2.6 శాతం తగ్గి 34.47 బిలియన్ డాలర్లకు

19.37 బిలియన్ డాలర్లకు వాణిజ్య లోటు



అంతర్జాతీయంగా నెలకొన్న ఇబ్బందికర పరిస్థితుల వల్లనే సెప్టెంబర్ నెలలో ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. వచ్చే ఆరు నెలల్లో తిరిగి కోలుకునే అవకాశాలున్నాయి. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలో రెండంకెల స్థాయిలో తగ్గిన ఎగుమతులు, ఆ తర్వాతి నెలల్లో సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యాయి.

- సునీల్ బర్థ్వాల్, వాణిజ్య శాఖ కార్యదర్శి

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: దేశీయ ఎగుమతులు మళ్లీ నీరసించాయి. గత కొన్ని నెలలుగా పెరుగుతూ వచ్చిన ఎగుమతులు గత నెలకుగాను 2.6 శాతం తగ్గుముఖం పట్టాయి. విదేశాల్లో దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పడిపోవడంతో గత నెలలో 34.47 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వరుసగా పది నెలలుగా తగ్గుతూ వచ్చిన దిగుమతులు సెప్టెంబర్‌లోనూ 15 శాతం తగ్గి 53.84 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్టు తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్లో కమోడిటీ ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని విశ్లేషించింది. దీంతో వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) 19.37 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

ఆరు నెలల్లోనూ అంతే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఎగుమతులు పడిపోయాయి. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 8.77 శాతం తగ్గి 211.4 బిలియన్ డాలర్లకు పడిపోయినట్లు తెలిపింది. ఇదే కాలంలో దిగుమతులు కూడా 12.23 శాతం తగ్గి 326.98 బిలియన్ డాలర్లకు తగ్గడం విశేషం. దీంతో వాణిజ్యలోటు 115.58 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

- గత నెలకుగాను ఎగుమతుల్లో 30 కీలక రంగాల్లో 12 రంగాలు ఆశాజనక పనితీరు కనబరిచాయి. వీటిలో ఖనిజం, ఫ్యాబ్రిక్స్, మాంసం, పాల ఉత్పత్తులు, పౌల్ట్రీ, ఫార్మా, ఇంజినీరింగ్, సముద్రపు ఉత్పత్తులు ఉన్నాయి.
- కానీ, పెట్రోలియం, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్ గూడ్స్, కెమికల్స్, జెమ్స్ అండ్ జ్యువెల్లరీ, లెదర్, టీ అండ్ కాఫీ విభాగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నాయి.
- దిగుమతుల విషయానికి వస్తే వెండి, ఎరువులు, బొగ్గు, వంటనూనెలు, క్రూడాయిల్, కెమికల్స్ ప్రతికూలంగా నమోదయ్యాయి.
- సెప్టెంబర్‌లో చమురు దిగుమతులు 20.32 శాతం తగ్గి 14 బిలియన్ డాలర్లకు పడిపోగా, గత ఆరు నెలల్లో 22.81 శాతం తగ్గి 82.3 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.
- పసిడి దిగుమతులు 7 శాతం అధికమై 4.11 బిలియన్ డాలర్లకు చేరాయి.
- సేవల ఎగుమతులు 29.2 బిలియన్ డాలర్ల నుంచి 29.37 బిలియన్ డాలర్లకు పెరిగాయి.
- మరోవైపు, ఆగస్టు నెల ఎగుమతుల గణాంకాలను కేంద్రం మార్చింది. గతంలో 34.48 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులను 38.45 బిలియన్ డాలర్లకు, అలాగే దిగుమతులను 58.64 బిలియన్ డాలర్ల నుంచి 60.1 బిలియన్ డాలర్లకు పెంచింది. దీంతో ఎగుమతుల్లో వృద్ధి 3.88 శాతానికి పరిమితమైంది.

టాప్‌గేర్‌లో బీఎండబ్ల్యూ

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నది. 2023 తొలి తొమ్మిది నెలల్లో సంస్థ 9,580 యూనిట్ల వాహనాలను విక్రయించింది. క్రితం ఏడాది ఇదే నెలల్లో విక్రయించిన వాటితో పోలిస్తే ఇది 10 శాతం అధికం. ప్రస్తుతం సంస్థ బీఎండబ్ల్యూ, మినీ, బీఎండబ్ల్యూ మోటోరాడ్(ద్విచక్ర వాహనాలు) బ్రాండ్లతో దేశీయంగా వాహనాలను విక్రయిస్తున్నది. వీటిలో బీఎండబ్ల్యూ బ్రాండ్‌తో 8,998 యూనిట్లను విక్రయించగా..మినీ బ్రాండ్‌తో 582 యూనిట్ల అమ్మకాలు జరిపింది. అలాగే ప్రీమియం మోటర్‌సైకిళ్లను 6,778 యూనిట్ల విక్రయాలు జరిపింది. గత కొన్నేండ్లుగా దేశీయంగా లగ్జరీ కార్లకు డిమాండ్ ఊపందుకుంటున్నదని బీఎండబ్ల్యూ గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పవాహ్ తెలిపారు. మార్కెట్లోకి కొత్త మాడళ్లను విడుదల చేయడం కూడా కలిసొచ్చిందన్నారు.

ఏటా 500 ఉద్యోగాలు

పారెక్సల్ ఇండియా ఎండీ సంజయ్ వ్యాస్



హైదరాబాద్, అక్టోబర్ 13: దేశవ్యాప్తంగా క్లినికల్ ట్రయల్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని అమెరికాకు చెందిన పారెక్సల్ ఇక్కడి సిబ్బందిని భారీగా పెంచుకోబోతున్నది. ప్రతియేటా 300 నుంచి 500 మంది వరకు సిబ్బందిని వచ్చే ఐదేండ్ల వరకు రిక్రూట్ చేసుకోనున్నట్టు పారెక్సల్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ వ్యాస్ తెలిపారు. ప్రస్తుతం సంస్థకు దేశవ్యాప్తంగా ఉన్న సెంటర్లలో 6 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, 2028 నాటికి ఈ సంఖ్యను 8 వేలకు చేరుకోనున్నది. హైదరాబాద్‌లో ఉన్న సెంటర్‌లో 2,400 మంది విధులు నిర్వహిస్తుండగా, ఈ వారంలో మరో 100 మందిని నియమించుకోనున్నట్లు ఆయన ప్రకటించారు.రాష్ట్రంలో ఫార్మా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు. మరోవైపు, వచ్చే ఏడాది హైదరాబాద్‌లో జరగనున్న బయోఏషియా సదస్సులో క్లినికల్ ట్రయల్స్‌పై ప్రత్యేక కార్యాక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వ వర్గాలకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఒకవేళ వచ్చే సదస్సులో క్లినికల్ ట్రయల్స్‌పై సదస్సు ఏర్పాటు చేస్తే పారెక్సల్ నుంచి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ప్రస్తుతం భారత్‌లో క్లినికల్ ట్రయల్ పరిశ్రమ 2.5 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నదని, ప్రతియేటా రెండంకెల వృద్ధితో 2028 నాటికి 5 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ఫార్మా సిటీలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో తమ పరిశోధనలు జరిపించుకోవడానికి 500 కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయన్నారు.

రెండు బ్యాంక్‌లకు ఆర్బీఐ షాక్

ముంబై, అక్టోబర్ 13: మూడు బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ గట్టి షాకిచ్చింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్‌బీఎల్ బ్యాంక్‌తోపాటు బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లు నియంత్రణ నిబంధనలు పాటించకపోవడంతో జరిమానా విధించింది. దీంట్లో రుణాలు, అడ్వాన్స్‌ల మంజూరు చేయడంలో యూనియన్ బ్యాంక్ నిబంధనలు పాటించకపోవడంతో కోటి రూపాయల జరిమానా విధించినట్లు ఆర్బీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే ఆర్‌బీఎల్ బ్యాంక్ లిమిటెడ్‌పై రూ.64 లక్షలు, బజాజ్ ఫైనాన్స్‌పై రూ.8.5 లక్షల జరిమానా విధించింది.

శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన డిజైన్ డెమోక్రసీ 2023 ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్. చిత్రంలో పింకీరెడ్డి, క్రెడాయ్ నేషనల్ చైర్మన్ రామిరెడ్డి తదితరులు

రెండోరోజూ నష్టాలు

ముంబై, అక్టోబర్ 13: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. బ్యాంకింగ్, ఆర్థిక, ఐటీ రంగ షేర్లలో భారీగా క్రయ విక్రయాలు జరగడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మార్కెట్లను నష్టాల వైపు నడిపించాయి. 500 పాయింట్ల శ్రేణిలో కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ చివరకు 125.65 పాయింట్లు నష్టపోయి 66,282.74 వద్ద ముగిసింది. 30 షేర్లలో 16 షేర్లు నష్టపోగా, 14 షేర్లు లాభాల్లో ముగిశాయి. ఈ పండుగ సీజన్‌లో వాహన అమ్మకాలు భారీగా పుంజుకుంటుందన్న అంచనాతో వాహన రంగ షేర్లు భారీగా లాభపడ్డాయి. ఎన్ఎస్ఈ నిఫ్టీ 42.95 పాయింట్లు కోల్పోయి 19,751.05 వద్ద ముగిసింది. వారాంతం ట్రేడింగ్‌లో యాక్సిస్ బ్యాంక్ 2.33 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు ఇన్ఫోసిస్, ఎస్బీఐ, విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్ నష్టపోయాయి. కానీ, టాటా మోటర్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, నెస్లె, మారుతిలు మాత్రం లాభాల్లో ముగిశాయి.

టాటా మోటార్స్‌కు రూ.1,614 కోట్ల నిధులు

టాటా టెక్నాలజీస్‌లో 10 శాతం వాటా విక్రయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: టాటా గ్రూప్ ఆటో మొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన సబ్సిడరీ టాటా టెక్నాలజీస్‌లో 10 శాతం వాటాను రూ.1,614 కోట్లకు విక్రయించనుంది. క్లైమేట్ ఫండ్ టీపీజీ రైజ్ క్లైమేట్‌కు వాటాను అమ్మేందుకు ఒక ఒప్పందంపై సంతకాలు చేసినట్టు టాటా మోటార్స్ శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఈ వార్తతో టాటా మోటార్స్ షేరు 4.76 శాతం పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.667 వద్ద ముగిసింది. టాటా మోటార్స్ రుణ భారాన్ని తగ్గించుకునేదిశగా నిధులు సమీకరించడానికి సబ్సిడరీలో వాటాను విక్రయిస్తున్నది. టాటా టెక్నాలజీస్ విలువ రూ.16,300 కోట్లుగా పరిగణించి జరిగిన ఈ డీల్ రెండు వారాల్లో పూర్తవుతుందని కంపెనీ తెలిపింది. ఇప్పటికే టాటా పాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీలో టీపీజీ రైజ్ క్లైమేట్ 1 బిలియన్ డాలర్లు పెట్టుబడి చేసింది. గ్లోబల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్లకు టాటా టెక్నాలజీస్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, డిజిటల్ సొల్యూషన్లను అందిస్తున్నది.

ఆంక్షల్లేవు కానీ..

దిగుమతిదారులపై గట్టి నిఘా పెడతాం

ల్యాప్‌టాప్ తదితర ఎలక్ట్రానిక్స్‌పై కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: ల్యాప్‌టాప్ దిగుమతులపై ఎటువంటి ఆంక్షలు ఉండబోవని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కానీ గట్టి నిఘా మాత్రం ఉంటుందని స్పష్టం చేసింది. నవంబర్ 1 నుంచి దేశంలోకి ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, కంప్యూటర్లు తదితర ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల దిగుమతులకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాల్సిందేనని ఈ ఏడాది ఆగస్టులో మోదీ సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఇక్కడ కేంద్ర వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్‌వాల్ విలేఖరులతో మాట్లాడుతూ.. ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు వంటి వాటి దిగుమతులకు లైసెన్స్ ఏమీ అక్కర్లేదన్నారు. అయితే ఆయా దిగుమతులపై ఓ కన్నేస్తామని చెప్పారు. 'ల్యాప్‌టాప్ దిగుమతులపై ఏ రకమైన ఆంక్షల్నీ తీసుకురావడం లేదు. కానీ వీటిని దిగుమతి చేసుకుంటున్న వారిని మాత్రం చాలా దగ్గరగా గమనిస్తూ ఉంటాం' అని సునీల్ అన్నారు.

కొత్త వ్యవస్థ..

ల్యాప్‌టాప్ తదితర ఎలక్ట్రానిక్స్‌ను దేశంలోకి దిగుమతి చేసుకోవడానికి ఎటువంటి లైసెన్స్ అక్కర్లేదంటున్న కేంద్ర ప్రభుత్వం.. దానికి బదులుగా మరో కొత్త వ్యవస్థను రంగంలోకి దించుతున్నది. నవంబర్ 1 నుంచి దిగుమతి నిర్వహణ వ్యవస్థను అమల్లోకి తెస్తున్నట్టు విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ (డీజీఎఫ్‌టీ) సంతోష్ కుమార్ సారంగి తెలిపారు. ఈ క్రమంలోనే ఈ నెల 30కల్లా దీనికి సంబంధించిన అన్ని పనులు పూర్తవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దేశీయంగా ఉత్పత్తిని పెంచడానికి, చైనా వంటి దేశాల నుంచి జరుగుతున్న దిగుమతులకు చెక్ పెట్టడానికి.. భారత్‌లోకి వచ్చే ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ట్యాబ్లెట్లు, మైక్రో కంప్యూటర్లతోపాటు కొన్ని డాటా ప్రాసెసింగ్ మెషీన్లపై కేంద్రం ఆంక్షలు విధించిన సంగతి విదితమే. ఇందులోభాగంగానే వచ్చే నెల 1 నుంచి వీటి దిగుమతులకు లైసెన్స్ ఉండాల్సిందేనన్నది. ఈ మేరకు డీజీఎఫ్‌టీ ద్వారా నోటిఫికేషన్